సాక్షి
నిజామాబాద్
శనివారం ၊ 23 ၊ డిసెంబర్ ၊ 2023



వేతన వెతలు
సమగ్రశిక్ష కార్యక్రమం కింద పనిచేస్తున్న ఉద్యోగులు సరైన సమయంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు.
- 8లో ▸



పదిలో మెరుగైన ఫలితాలు..
ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.3 /13.2
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం నుంచి మేఘావృతం అవుతుంది. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు వైకుంఠ ఏకాదశి
- భక్తులకు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



నిజామాబాద్ సిటీ : ముక్కోటి ఏకాదశి వేడుకలకు జిల్లాలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని అన్ని వైష్ణవాలయాల ఉత్తర ద్వారాలు నేడు బ్రహ్మ ముహుర్తాన తెరుచుకోనున్నాయి. ఈ ద్వారం వెంట వెళ్లి స్వామిని దర్శించుకుంటే పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు, జిల్లాలోని వైష్ణవాలయాల ఉత్తరద్వారాలను అందమైన పూలతో, రంగురంగుల విద్యుత్ లైట్లతో అలంకరించారు. నగరంలోని జెండా బాలాజీ ఆలయం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రం, ఆర్యనగర్ వెంకటేశ్వర ఆలయం, సుభాష్‌నగర్ కోదండ రామాలయం, సాయినగర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఖిల్లా రఘునాథాలయం ఆలయాల్లో ఉత్తరద్వారం గుండా దర్శన సౌకర్యం కల్పించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత ముందుండాలి



నిజామాబాద్ నాగారం : నగరంలోని న్యూ అంబేద్కర్ భవనంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ హోజరై జ్యోతిప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళుర్పించారు. యువతకు సామాజిక సేవతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉత్సాహాన్నిస్తాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభచాటిన వారిని రాష్ట్రస్థాయికి పంపామన్నారు. ప్రతి ఏడాది యువజనోత్సవాలు గతంలో పెద్దఎత్తున నిర్వహించేవారు. వారం రోజుల ముందుగానే కార్యక్రమాల నిర్వహణ సమాచారం అధికారి ప్రకటించేవారు. ఈ ఏడాది హడావుడి లేకుండానే ముగించారు.

దరఖాస్తుల ఆహ్వానం
డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రతిభ (సీవోఈ) కళాశాలల్లో 2024–25లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బి.సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 38 సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 38 కళాశాలల్లో బాలురకు 1,680, బాలికలకు 2,000 సీట్లు ఉన్నాయన్నారు. రెండు అంచెల పరీక్షల ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు.ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ www.tswreis.ac.inను చూడాలన్నారు. దరఖాస్తుకు రూ. 200లు ఫీజు చెల్లించాలని, చివరి తేదీ 15 జనవరి 2024, మొదటి స్క్రీనింగ్ పరీక్ష 04 ఫిబ్రవరి 2024న, రెండో స్క్రీనింగ్ పరీక్ష 25 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు.

'మహాలక్ష్మి'కి స్పందన



ఖలీల్‌వాడి : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సులలో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో సగటున ప్రయాణికుల సంఖ్య గతంలో నిత్యం 1.70 లక్షల వరకు ఉండేది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆ సంఖ్య 2.60 లక్షలకు పెరిగింది. ఇందులో 60 శాతం వరకు మహిళలు ఉన్నారు. గరుడ, రాజధాని, డీలక్స్ బస్సులలో ప్రయాణికుల సంఖ్య యథావిధిగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలు ఉండగా మొత్తం 615 బస్సులు 256 రూట్లలో తిరుగుతున్నాయి. గతంలో ఆర్టీసీకి నిత్యం రూ.90 లక్షల ఆదాయం రాగా ఇప్పుడు రూ.1.15 కోట్ల ఆదాయం వస్తుంది.

అన్ని రూట్లకు బస్సులు నడుస్తున్నాయి
రీజియన్ పరిధిలో అన్ని రూట్లకు బస్సులు నడుస్తున్నాయి. మహాలక్ష్మి పథకంతో రద్దీ పెరిగింది. మహిళలు ఉచిత టికెట్‌కు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపాలి.
– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

ఆగమాగం.. ఆర్‌వోబీ పనులు


సత్తనడకన సాగుతున్న అడవిమామిడిపల్లి ఆర్‌వోబీ పనులు

జిల్లాలో రెండు చోట్ల కొనసాగుతున్న రైల్వేఓవర్ బ్రిడ్జిల పనుల వద్ద వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిజామాబాద్ – ఆర్మూర్ జాతీయ రహదారి మీద అడవిమామిడిపల్లి వద్ద ఆర్వోబీ పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. నగర శివారులోని మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనుల్లో భాగంగా తవ్విన భారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ గుంతల పక్కనుంచే వాహనాలు వెళ్తున్నాయి. అయినా ఇక్కడ ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. ఇక రైల్వేగేట్లు పడిన సమయంలో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


మాధవనగర్ ఆర్వోబీ పనుల వద్ద చీకట్లో వెళ్తున్న వాహనాలు

తొమ్మిదేళ్లుగా 'అడవి మామిడిపల్లి' పనులు

- వాహనాలు గ్రామంలోకి వచ్చినప్పుడు దుమ్ముతో ప్రజలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ – ఆర్మూర్ జాతీయ రహదారి మీద మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 2015 నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ రహదారి మీద ఓవర్ బ్రిడ్జి కట్టేందుకు గాను రైల్వే శాఖ రూ.17 కోట్లు కేటాయించింది. ఇందులో భూసేకరణకే రూ.7 కోట్లు కాగా, మిగిలిన రూ.10 కోట్లు నిర్మాణ పనులకు కేటాయించారు. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలోనే ఇరువైపులా అప్రోచ్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అయినప్పటికీ పనులు ముందుకు కదలడంలేదు. ఇదిలా ఉండగా రైల్వేలైన్‌పై వంతెనను మాత్రం రైల్వేశాఖ యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేసి ఇచ్చింది. మిగిలిన రెండువైపులా అప్రోచ్ రోడ్డు పనులను ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టారు. కాంట్రాక్టర్ ఈ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉన్నాయి. అయితే ఎన్‌హెచ్ అధికారుల అలసత్వం కారణంగా పనులు ఏమాత్రం ముందుకు కదలడం లేదు. దీంతో వాహనదారులతో పాటు అడవిమామిడిపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ లైన్ ద్వారా ప్రతిరోజూ 12 రైళ్లు నడుస్తున్నాయి.

పలుసార్లు గేట్ వేస్తుండడంతో ట్రాఫిక్ అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కొన్ని సార్లు రైల్వేగేట్ లాక్ మొరాయిస్తుండడంతో నిజామాబాద్ నుంచి టెక్నీషియన్ వస్తేనే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉంది. గంటల తరబడి ఆలస్యం అవుతుండడంతో వాహనాలు గ్రామం లోపలి నుంచి వెళుతున్నాయి. దీంతో విపరీతమైన దుమ్ము లేస్తుండగా గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని అడవిమామిడిపల్లి సర్పంచ్ మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొరం.. అక్రమం
ఆర్‌వోబీకి సంబంధించిన పనులకు మొరం పూర్తిగా అనుమతులు లేని ప్రాంతాల నుంచి అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. ఈ విషయమై రెండేళ్ల కిందట గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులు సైతం వెళ్లాయి. ఆ సమయంలో అక్కడకు వెళ్లిన మైనింగ్ అధికారులు మొరంతో నింపిన సిమెంట్ బ్లాక్స్(బిళ్లలు)ను పంచనామా చేశారు. తర్వాత దాన్ని పట్టించుకోలేదు. దీంతో మొరం అక్రమ తోలకం అలాగే సాగుతోంది. సుప్రీంకోర్టు రూలింగ్ ప్రకారం గనుల శాఖ అనుమతులు లేకుండా మొరం తరలిస్తే జరిమానా విధించాలి. కానీ గనుల శాఖ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై నిజామాబాద్ మైనింగ్ ఏడీ సత్యనారాయణను 'సాక్షి' వివరణ కోరగా ప్ర భుత్వ పనికి సంబంధించి అక్రమ మొరం.. సక్రమ మొరం అనేది ఉండదని చెప్పడం మరింత విచిత్రం. పైగా సిమెంట్ బ్లాక్స్ పంచనామా చేసిన విషయమై అడుగగా అది రెండేళ్ల కిందట జరిగిన వ్యవహారమంటూ తేలికగా తీసుకోవడం మరో విచిత్రం.

పనులు త్వరగా పూర్తి చేయాలి..

రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ఆర్వోబీ పనుల్లో భాగంగా తవ్విన గుంతల వద్ద ప్రమాద సూచికలు లేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
– అబంట్ల రాజేశ్వర్, ధర్మారం

ప్రమాద సూచికలు లేవు..

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరిగే చోట రైల్వేగేట్ పడితే రెండువైపులా అరకిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రయాణికులు ఎటువెళ్లాలో తెలియక బైపాస్ మీదుగా చుట్టూ తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. పనుల వద్ద ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలి.
– ఏ చిరంజీవి, నగర వాసి

గాలివానకు దెబ్బతిన్నాయి..
ఆర్వోబీ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రమాద, ప్రయాణ సూచికలు గత నెలలో కురిసిన వడగళ్లు, గాలివానకు ఎగిరిపోయాయి. కొన్ని దెబ్బతిన్నాయి. పనుల వద్ద లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం మా డిపార్టుమెంట్ పని కాదు. దీనిని ఎలక్ట్రిసిటీ ఇతర డిపార్టమెంట్ వారు చూసుకోవాలి.
– సాయికుమార్, ఏఈ ఆర్‌అండ్‌బీ

చీకట్లో ప్రమాదకరంగా..

- వాహనాల రద్దీతో తీవ్ర ఇబ్బందులు
- గుంతల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలంటున్న ప్రయాణికులు

నిజామాబాద్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా నిర్మిస్తున్న నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనుల వద్ద నిత్యం గజిబిజి చోటు చేసుకుంటుంది. ప్రతిరోజు భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ పనుల వద్ద గుంతల సమీపంలో ప్రమాద సూచికలు లేక వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. పొరపాటున గుంతల్లోకి జారితే పెద్ద ప్రమాదమే సంభవిస్తుంది. రైలు గేటు పడితే అర కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోతాయి. రాత్రి సమయంలో లైటింగ్ లేక చీకట్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రూ. 90.12 కోట్ల వ్యయంతో..
ఆర్‌వోబీ పనుల్లో రూ.30.05 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కాగా, రూ.60.07 కోట్లు కేంద్ర ప్రభుత్వానివి. జనవరిలో ఆర్‌వోబీ పనులు ప్రారంభమయ్యాయి. పనులు మందకొడిగా సాగుతున్నందున వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో పనులు జరిగే చోట లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాహనాల రద్దీతో విపరీతమైన దుమ్ము లేవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.అధికారులు స్పందించి వాహనాలు వెళ్లే దారిలో ఉదయం, సాయంత్రం నీటిని చల్లించాలని కోరుతున్నారు.

బైపాస్ రోడ్డు మీదుగా..
ఆర్‌వోబీ పనులు జరిగే చోట రాత్రివేళ భారీ వాహనాలు నిలుపుతున్నారు. దీంతో చాలా కార్లు, బైక్‌లపై వెళ్లేవారు కంఠేశ్వర్ బైపాస్ మీదుగా చుట్టూ నాలుగు కిలో మీటర్లు తిరిగి నగరంలోకి ప్రవేశిస్తున్నారు. బైపాస్ రోడ్డు వద్ద, ఆర్‌వోబీ పనులు జరిగే ప్రదేశంలో లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే వాహదారులకు ఇబ్బందులు తప్పుతాయి.


మాధవనగర్ ఆర్వోబీ పనుల వద్ద వాహనాల రాకపోకలు

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



సుభాష్‌నగర్ : అర్హులు తమ పేర్లను ఓటరుజాబితాలో నమోదు చేసుకునేలా రాజకీయపార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకుని కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు పూర్తయిన వారందరూ ఓటర్లుగా పేరు నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. జనవరి 6న డ్రాఫ్ట్ రోల్ పబ్లిష్ అవుతుందన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ప్రజలు కూడా ఫారం–8 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. 2024 ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు.

ప్రశ్నిస్తే ఎంపీలను సస్పెండ్ చేస్తారా..?

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

ఖలీల్‌వాడి : దేశంలో సమస్యలపై పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నిస్తే సస్పెండ్ చేయడం బీజేపీ అసమర్థ పాలనకు నిదర్శనమని డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ధర్నా చౌక్ వద్ద జిల్లా, నగర కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ద్వారా పార్లమెంట్‌లోకి వచ్చిన దాడులు జరిపిన విషయంలో చర్చించాలని ఎంపీ టు పట్టుబడితే వారిని సస్పెండ్ చేయడం ఎంత వరకు సబబన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించిన ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటులో ఉండకుండా చూసి మతపరంగా వారు తెచ్చే బిల్లులను అమలు చేసుకునేందుకు ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం సరైంది కాదన్నారు. నియంతృత్వపోకడలకు పోతే కేసీఆర్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్‌హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవ వేణు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షు లు ముప్ప గంగారెడ్డి, భక్తవత్సలం, సీనియర్ నాయకులు రత్నాకర్, పీసీసీ డెలిగేట్ బాడ్సి శే ఖర్ గౌడ్, జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు వేణురాజ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, చంద్రకళ, ఉష, విజయలక్ష్మి, రేవతి, కార్పొరేటర్ రోహిత్ ఉన్నారు.


మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

కొత్త కరోనా వేరియంట్‌తో భయం వద్దు

దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, కేసులు వేగంగా పెరుగుతున్నా ప్రభావం అంతగా ఉండదని ప్రముఖ వైద్యుడు జలగం తిరుపతి రావు అన్నారు. ఒమిక్రాన్ మాదిరిగానే అలావచ్చి వెళ్లిపోతుందని, కరోనాకు సంబంధించి ఏడు రకాల వేవ్‌లు వచ్చే అవకాశం ఉండగా ప్రస్తుతం ఫోర్త్‌వేవ్ నడుస్తోందన్నారు. వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో సూచనలు సలహాలు ఇచ్చారు. – నిజామాబాద్ నాగారం



- ఒమిక్రాన్ లాగే ప్రభావం చూపదు
- ప్రస్తుతం ఫోర్త్ వేవ్ నడుస్తోంది
- వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో డాక్టర్ జలగం తిరుపతిరావు

➡ కరోనా వేరియంట్‌తో ప్రజలను కొందరు భయపెడుతున్నారు.. దీనిపై మీ వివరణ?
– పెద్ది అంజనేయులు, ఎంపీడీవో మహాముత్తారం మండలం, భూపాలపల్లి జిల్లా

✍ కరోనా కొత్త వేరియంట్‌పై కావాలని ఎవరూ పబ్లిసిటీ చేయరు. ప్రస్తుతం వస్తోన్న ఫోర్త్‌వేరియంట్‌తో ఎలాంటి ఇబ్బంది లేదు. నేను చేసిన చాలా వీడియాల్లో క్లారిటీగా జాగ్రత్తలను వివరించాను.

➡ కొత్త వేరియంట్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? – సుభాష్–నందిపేట్, లత–నవీపేట్

✍ ప్రస్తుత్తం వస్తున్న కరోనాతో భయం వద్దు. గుంపు, రద్దీగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్తే మాస్క్ ధరించాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగలతో బాధపడుతున్న వారు, పిల్లలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

➡ రెండు రోజులుగా గొంతు నొప్పి, జ్వరం, దగ్గు ఉంది? – నవీన్, గోవూరు

✍ సాధారణ జ్వరంలో భాగంగానే ఇవన్నీ ఉంటాయి. వాసన లేకపోవడం, ఒళ్లు నొప్పులతో పాటు జ్వరం, ముక్కు కారడం లాంటివి ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

➡ కరోనా కారణంగా నాటూర్ రద్దు చేసుకోవాలా?
– రవీందర్, నిజామాబాద్

✍ ప్రస్తుతం ఉన్న కరోనా వేవ్‌తో భయం వద్దు. నిర్భయంగా వెళ్లొచ్చు. కాని వృద్ధులతో కాకుండా యూత్‌తో వెళ్తే పర్వాలేదు.

➡ మూడు రోజులగా జలుబు, జ్వరం, దగ్గు ఉంది కరోనా వచ్చినట్లేనా?
– సాయి, జానకంపేట్

✍ కొత్త వేరియంట్‌తో ఆందోళన చెందవద్దు. మీకు ఆందోళనగా ఉంటే దగ్గర్లోని పీహెచ్‌సీలో టెస్ట్ చేయించుకోవాలి.

➡ గతంలో కోవిడ్‌వ్యాక్సిన్ తీసుకున్నాను. ఇప్పుడు పనిచేస్తుందా..? – తులసీ ప్రసాద్, నిజామాబాద్

✍ గతంలో కోవిడ్ వ్యాక్సిన్ తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. కొత్త వేరియంట్‌తో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

➡ రెండు రోజులుగా పొడిదగ్గు, రాత్రుల్లో జ్వరం వస్తుంది? – గజన్‌లాల్, మెట్‌పల్లి తండా

✍ చలికాలం కాబట్టి పొడిదగ్గు ఉంటుంది. రాత్రుల్లో వచ్చే జ్వరంతో కరోనాకు ఎలాంటి సంబంధం లేదు. ఇబ్బందిగా ఉంటే వైద్యుడిని సంప్రదించాలి.

➡ కరోనా వచ్చిందని ఎలా గుర్తించాలి..? – చందు, తూంపల్లి

✍ కరోనా వచ్చిందని గుర్తించడానికి వాసన లేకపోవడం, దగ్గు, జ్వరం, ముక్కుకారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, మూడు నుంచి 5 రోజుల పాటు లక్షణాలు ఉంటే దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్లి కరోనా టెస్ట్ చేయించుకోవాలి. ఒక కరోనా పాజిటివ్ వచ్చినా ఇంట్లోనే చికిత్స తీసుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

➡ ఒళ్లునొప్పులు, జ్వరం ఉంది. కరోనాగా అనుమానించొచ్చా..?
– గణపతి నాయుడు, రహత్‌నగర్, భీమ్‌గల్

✍ చలికాలం కారణంగా సాధారణ జ్వరంతో పా టు జలుబు ఉంటుంది. మీరు ఒళ్లు నొప్పులున్నాయంటున్నారు. భయాందోళన వద్దు. నావద్దే చికిత్స పొందామంటున్నారు.

➡ గతంలో కరోనాకు ఫోన్ ద్వారా ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
– కుమార్–బోధన్, రెడ్డి–రాజ్‌పూర్ తండా(వర్ని)

✍ గతంలో కరోనాకు ఇప్పటి కరోనాకు చాలా తేడా ఉంది. దీర్ఘకాలికంగా వ్యాధులతో ఇబ్బందిపడే వారు మాత్రమే కరోనాతో జాగ్రత్తగా ఉండాలి.

➡ ప్రస్తుత వేరియంట్ ప్రభావం ఎలా ఉంది.
–ప్రసాద్, కామారెడ్డి, ప్రసాద్–ఫాస్ట్‌పుడ్ సెంటర్, నిజామాబాద్

✍ కొత్త వేరియంట్లు ఎక్కువమందికి సోకే అవకాశముంది. అయిన బెంగ అవసరం లేదు. ఈ వేరియంట్‌తో ఎలాంటి ముప్పు లేదు. దీర్ఘకాలికంగా కాలేయం, లివర్, షుగర్స్ తదితర సమస్యలతో బాధపడే వారు జాగ్రత్తగా ఉంటే చాలు.

➡ కొత్త వేరియంట్‌ను తట్టుకునేందుకు ఎలాంటి ఆహారం అవసరం?
– చందర్, నిజామాబాద్

✍ కొత్త వేరియంట్ సోకితే మంచి ఆహారం తీసుకోవాలి. నిద్ర ఉండాలి. మాస్కులు ధరించాలి. తాజాపండ్లు, కూరగాయలు తీసుకోవాలి.

➡ కరోనా వస్తే జాగ్రత్తలేమిటి? – అనిల్, పెద్దవాల్గోట్, రాజు–ముషీర్‌నగర్, సీత–ఇందల్వాయి

✍ కరోనా లక్షణాలు ఉంటే ముందుగా ప్రభుత్వ ఆస్పత్రిలో టెస్టు చేయించుకోవాలి. పాజిటివ్ వస్తే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలి.

➡ జిల్లాలో ఎలాంటి పరిస్థితి ఉంది?
–అఖిల్, బోధన్

✍ రాష్ట్రంలో జిల్లాలో కరోనా కేసులు పెద్దగా లేవు. ఏదేమైనా ప్రతిఒక్కరూ కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

➡ విదేశాలకు వెళ్తున్నాను. టెస్ట్ చేయించుకోవాలా?
– తాజోద్దీన్, నందిపేట

✍ ముందస్తుగానే కరోనా టెస్టులు చేయించుకుంటే బాగుంటుంది. జలుబు, జ్వరం, దగ్గు ఉంటే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలి. విమానాశ్రయాల్లో కరోనా టెస్ట్ రిపోర్ట్ అడిగే అవకాశం ఉంది.

➡ విద్యార్థులకు కరోనా వస్తే?
– సురేశ్, హెడ్‌మాస్టర్, అమ్రాద్

✍ చాలా మంచి ప్రశ్న అడిగారు. పాఠశాలల్లో విద్యార్థులకు జలుబు, దగ్గు, తలనొప్పి, జ్వరం ఉంటే లక్షణాలు ఉంటే అప్రమత్తమవ్వాలి. విద్యార్థులకు ప్రాజెక్ట్ రూపంలో విద్యార్థులకు, టీచర్లకు అవగాహన కల్పించాలి. ఎవరైనా విద్యార్థులకు ఇలాంటి లక్షణాలు ఉన్నట్లు అనిపిస్తే ఇంటివద్దే ఉండేలా ప్రోత్సహించాలి. వారికి పౌష్టికాహారం, నీరు, పండ్లు అందిస్తే సరిపోతుంది. నాలుగు రోజుల్లో ఎప్పటిలాగే స్కూల్‌కు రావొచ్చు.

క్లుప్తంగా

డీసీసీబీ సీఈవోగా నాగభూషణం



సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా నాగభూషణం వందే శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఈవోగా పనిచేసిన గజానంద్ పదవీ కాలం పూర్తవడంతో తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు(టీఎస్‌కాబ్) నాగభూషణంను సీఈవోగా ఎంపిక చేసింది. ఆయన ఎస్‌బీఐలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి గతేడాది పదవీ విరమణ పొందారు. సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాగభూషణంకు చైర్మన్ సహా సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

27 నుంచి ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈనెల 27వ తేదీ నుంచి డిగ్రీ ద్వితీయ, తృతీయ మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయని కో–ఆర్డినేటర్ రంజిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో గల అధ్యయన కేంద్రాల్లో చదువుతున్న సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిజామాబాద్ జిల్లాలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భరోసా సెంటర్‌లో ఉద్యోగావకాశాలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లో కొత్తగా ఏర్పాటు కానున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపాదికన పోస్టులను భర్తీ చేయనున్నట్లు డీసీపీ జయరాం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరిల్లో ఐదు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒక లీగల్ సపోర్టింగ్ పర్సన్, ఒక రిసెప్షనిస్టు, ఒక ఏఎస్ఎం, రెండు సపోర్ట్ పర్సన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. లీగల్ సపోర్టింగ్ పర్సన్ పోస్టుకు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం చదివి 24 నెలల అనుభవం కలిగి ఉండాలి. సపోర్ట్ పర్సన్ పోస్టుకు సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్‌మెంట్/సైకాలజిస్ట్ పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉండాలి. 12 నెలల ఎక్స్‌పీరియన్స్ ఉండాలి. రిసిప్షనిస్టు పోస్టు కోసం డిగ్రీ విద్యార్హత ఉండాలి. కంప్యూటర్, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఏఎస్ఎం పోస్టుకోసం బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం చదివి ఉండాలి. దరఖాస్తులను పూర్తి సమాచారంతో పోలీస్ కమిషనరేట్‌లోని కార్యాలయంలోని ఇన్‌వార్డు సెక్షన్‌లో ఈనెల 29లోపు అందజేయాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ స్టేజీ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో నేరుగా డెమోకు హాజరు కావాలని కోరారు.

వేతన వెతలు..!

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు ఆలస్యం
- కేంద్రం తనవంతు వాటా నిధులు విడుదల చేసినా..
- రాష్ట్ర వాటాకు సంబంధించి గత ప్రభుత్వ తప్పిదంతో విడుదల కాని వైనం



మోర్తాడ్(బాల్కొండ): సమగ్ర శిక్ష కార్యక్రమం కింద పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతనాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను కేటాయించాల్సి ఉంటుంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం తనవంతు వాటా నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి గతంలోనే జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను జమ చేయకుండా కేంద్రం ఇచ్చిన నిధులతో గత నవంబర్ వరకు వేతనాలు చెల్లిస్తూ వచ్చింది. ఈ నెలలో వేతనాలు చెల్లించాల్సి ఉండగా సమగ్ర శిక్షలో నిధుల కొరత ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదంతో డిసెంబర్ వేతనాలు ఇప్పటికీ రాలేదు. విద్యాశాఖ కార్యాలయాల్లో, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులకు సమగ్ర శిక్ష ద్వారానే వేతనాలు అందుతున్నాయి. జిల్లాలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఖ్య 919గా ఉంది. రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం సమగ్ర శిక్ష కార్యక్రమానికి నిధులు ఇచ్చి వేతనాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వం స్పందించాలి



కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. సమగ్ర శిక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటా నిధులను జమ చేసేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి.

– దప్పు దిలీప్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమాఖ్య చైర్మన్

నిజాంషుగర్స్ లేఆఫ్‌కు నేటితో ఎనిమిదేళ్లు..

బోధన్: నిజాంషుగర్స్(ఎన్డీఎస్ఎల్) లేఆఫ్ ప్రకటించి శనివారంతో ఎనిమిదేళ్లు పూర్తయ్యింది. 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ ప్రైవేటు యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి(మెదక్) యూనిట్లను మూసివేసింది. దీంతో వందల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. రైతులు చెరుకు సాగుకు దూరమై నష్టాల పాలయ్యారు. ఫ్యాక్టరీని తెరిపించాలని ప్రధాన రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికులు ఇప్పటికీ పోరాడుతున్నారు. 2014 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని పూర్వవైభవం తెస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ తెరుచుకోలేదు. కనీసం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కాగా ఉపాధి కోల్పోయిన కార్మిక కుటుంబాలు అధోగతి పాలయ్యాయి. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని కార్మికులు ఎదురుచూస్తున్నారు.



బోధన్ ఎన్డీఎస్ఎల్ ముఖచిత్రం(ఫైల్)

క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌లో అపార అవకాశాలు

తెయూ(డిచ్‌పల్లి): క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్తులో అనేక మందికి ఉపాధి లభిస్తుందని రిసోర్స్‌పర్సన్స్, ఆస్పైర్ క్లినిక్ అకాడమీ(వరంగల్) ప్రతినిధులు బి.కృష్ణవేణి, ఎస్.ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'క్లినికల్ డాటా అవకాశాలు– సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ఆధునిక సమాజంలో క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌లో అనేక రకాల నైపుణ్యాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకున్న వారు ఉపాధి అవకాశాలు పొందుతారని తెలిపారు. తెయూ ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు ఆస్పైర్ క్లినిక్ అకాడమి తరఫున ఇంటర్న్‌షిప్‌తో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో–ఆర్డినేటర్ బోయపాటి శిరీష, అధ్యాపకులు ప్రొఫెసర్ నసీం, వాసం చంద్రశేఖర్, మావురపు సత్యనారాయణ, నర్సయ్య, రమ్య పాల్గొన్నారు.



క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి

మూతపడిన కళాశాలలో అగ్నిప్రమాదం

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు వెళ్లే దారిలో మూతపడిన కళాశాలలో అగ్ని ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి కళాశాలలోని రెండు గదుల్లో ఉన్న కుర్చీలకు దుండగులు నిప్పంటించారని భావిస్తున్నారు. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కళాశాలకు సంబంధించిన కుర్చీలు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ చలాన్లపై భారీ డిస్కౌంట్

- రాయితీని సద్వినియోగం చేసుకోవాలంటున్న పోలీసులు
- గతేడాది జిల్లాలో వసూలైన పెండింగ్ చలాన్లు సుమారు రూ. 4 కోట్లు

ఖలీల్‌వాడి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను వసూలు చేసేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది. ఇందుకోసం భారీగా రాయితీలు ప్రకటించింది. గతేడాది ఇలాగే డిస్కౌంట్ ప్రకటించడంతో ఏకంగా రూ. 4 కోట్ల వరకూ పెండింగ్ చలాన్లు వసూలైనట్లు తెలిసింది. మళ్లీ ఇదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. 2022 డిసెంబర్ 31 నాటికి జిల్లాలో 3.88 లక్షల చలాన్లకు రూ.12.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో ఇంకా కొన్ని చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో గతేడాది ప్రత్యేక రాయితీ ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం, బైక్‌లయితే 80 శాతం, కార్లు, ఆటోలకు 60 శాతం రాయితీ, మిగితా భారీ వాహనాలకు 50 శాతం రాయితీ ఇచ్చారు. డిసెంబర్ 26 నుంచి జనవరి 16 వరకు ఈ చలాన్లను చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో చలానాలు చెల్లించేవారికే ఈ రాయితీ వర్తిస్తుంది.

అర్థశాస్త్ర పరిశోధనలే ఆర్థిక ప్రగతికి మూలాధారం



తెయూ(డిచ్‌పల్లి): అర్థశాస్త్ర పరిశోధనలే దేశ ఆర్థిక ప్రగతికి మూలాధారని అర్థశాస్త్ర విభాగాధిపతి పున్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'దత్తాంశ సేకరణ అనువర్తనీయత' అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోడరేటర్స్‌గా పాల్గొన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ న్యానేశ్వర్, వెంకటేశ్‌లు మాట్లాడుతూ.. ప్రామాణికమైన దత్తాంశంతోనే వాస్తవ ఫలితాలు వస్తాయన్నారు. దత్తాంశ సేకరణకు నిబద్ధతతో ప్రశ్నావళిని రూపొందించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా వన్ నేషన్ వన్ రేషన్ అనే నినాదంతో ప్రజా పంపిణీ పథకాన్ని ముందుకు తీసుకుపోవాలని ప్రధాని ప్రకటించిన సందర్భంగా ఒక సర్వేను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, పాత నాగరాజు, స్వప్న, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న అధికారులు

- విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. టెన్త్ విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేలా ప్రతి విద్యార్థి వారీగా చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఫలితాల్లో జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తిస్తూ, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ముఖ్యంగా ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను గమనించాలని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ అత్యుత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఈ మేరకు ఎంఈవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వార్షిక పరీక్షలకు మరో మూడు నెలల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ నాణ్యమైన విద్యను బోధించేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థుల కాపీయింగ్ వంటి వాటిపై ఆధారపడకుండా, తమ స్వశక్తితో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించేలా వారిని సన్నద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఈవో దుర్గాప్రసాద్, జీసీడీవో వనిత, ఏసీఈ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఇంటర్ కాలేజీ ఖోఖో జట్ల ఎంపిక



వర్సిటీ ఇంటర్ కాలేజీ ఖోఖో ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను శుక్రవారం క్యాంపస్ క్రీడామైదానంలో రిజిస్ట్రార్ యాదగిరి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. తెయూ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి సుమారు వందమందికి పైగా క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడా పోటీలకు పంపనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. డిసెంబర్ 26 నుంచి 30వరకు కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల జట్టు పోటీలు జరుగుతాయని తెలిపారు. అలాగే డిసెంబర్ 26 నుంచి 29వరకు తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో మహిళల జట్టు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ క్రీడావిభాగం డైరెక్టర్ బాలకిషన్, ఫిజికల్ డైరెక్టర్స్ బీఆర్‌నేత, అనిల్ కుమార్, సౌమ్య, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ జాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

ఆత్మహత్యే శరణ్యం..

- భార్య, కూతురుతో కలిసి వార్డుమెంబర్ నిరసన
- మూడేళ్లయినా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన



భార్య, కూతురుతో కలిసి పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న శైలేందర్

నవీపేట: మూడేళ్ల కిందట చేపట్టిన ఇంకుడు గుంతల పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా చెల్లించలేదని ఓ వార్డు మెంబర్ గురువారం నవీపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. భార్య, కూతురుతో కలిసి వచ్చి అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టాడు. మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు ఎత్తొండ శైలేందర్ 2020–21లో 170 ఇంకుడు గుంతల నిర్మాణం చేయించాడు. నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అప్పుచేసి వాటిని పూర్తి చేయించాడు. 73 ఇంకుడు గుంతలకు ఈజీఎస్‌పై ఏపీవో రాజేశ్వర్ రూ. 2లక్షల వరకు బిల్లులు చెల్లించాడు. ఈ బిల్లుల చెల్లింపునకు ఏపీవో రూ. 20వేలు లంచం తీసుకున్నాడని బాధితుడు ఆరోపించాడు. మిగతా డబ్బులు చెల్లించాలని అడగగా మరో రూ. లక్ష లంచం ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నాడని బాధితుడు శైలేందర్ కన్నీరు పెట్టుకున్నాడు. మాకు ఆత్మహత్యే దిక్కని.. కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు తాగి చనిపోతామని ఆందోళన చేపట్టాడు. స్పందించిన ఎంపీడీవో సాజిద్‌అలీ తన చాంబర్‌లోకి పిలిపించుకుని వివరాలు తెలుసుకున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని ఏపీవో రాజేశ్వర్, జీపీ కార్యదర్శి అఖిల్‌ను ఆదేశించారు.

విద్యుత్‌శాఖ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు అభినందన



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎస్ఈ రవీందర్ శుక్రవారం అభినందించారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఖమ్మం జిల్లాలో ఇంటర్ సర్కిల్ కబడ్డీ, టెన్నీస్ టోర్నమెంట్లు జరిగాయి. ఇందులో కబడ్డీలో నిజామాబాద్ జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎస్ఈ అభినందించారు. కార్యక్రమంలో డీఈటీ రమేష్, ఎస్ఏవో రాజశేఖర్, ఏఏవో గంగారాం, ఏడీ తోట రాజశేఖర్, జేఏవో సురేష్, మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

రుద్రూర్: రుద్రూర్ మండలం అంబం(ఆర్) క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంనకు చెందిన దిమ్మల్‌వార్ లక్ష్మణ్ (25) ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే సమయంలో రుద్రూర్‌కు చెందిన సాయి కుమార్ అనే యువకుడు బైక్‌పై పొలానికి వెళ్తుండగా అంబం (ఆర్) క్రాస్ రోడ్డు సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సాయికుమార్‌ను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నరేశ్ పరిశీలించి మృతదేహాన్ని బోధన్ ఏరియాస్పత్రికి తరలించారు.

ప్రధాన రహదారిపై బాధితుల ఆందోళన

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలో శుక్రవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు రాక ముందే మృతదేహాన్ని ఆస్పత్రికి ఎందుకు తరలించారని పోలీసులను ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన బైకులను కూడా ఘటనా స్థలం నుంచి తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మణ్ మృతిపై అనుమానం ఉందని ఆరోపించారు. ఎస్సై నరేశ్ ఘటనా స్థలానికి వచ్చి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రుద్రూర్ శివారులో ఘటనా స్థలం వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు



లక్ష్మణ్(ఫైల్)

చికిత్స పొందుతూ వృద్ధుడు..



వృద్ధుడి మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ స్టేజీ వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి వైపు నుంచి నిజామాబాద్ వైపునకు మేకల లోడ్‌తో వెళ్తున్న బొలేరో వాహనం గురువారం రాత్రి కుప్రియాల్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

యువతి అదృశ్యం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. గురువారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత, ఆమె బయటకి వెళ్లి వస్తానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి శుక్రవారం రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



శివాని మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): స్నేహితురాలి పెళ్లి విషయంలో భర్తతో గొడవపడి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జుక్కల్ మండలం శక్తినగర్‌లో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సత్యనారాయణ తెలిపిన కథనం ప్రకారం.. జుక్కల్ మండలం గుండూరుకు చెందిన శివాని తన స్నేహితురాలి పెళ్లికి వెళ్తానని భర్త పాండురంగ్‌ను కోరింది. స్నేహితురాలి పెళ్లి హైదరాబాద్‌లో ఉండడంతో.. పెళ్లికి కాకుండా శక్తినగర్‌లో జరిగే పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొని వచ్చేయని భర్త చెప్పి పంపించారు. నాలుగు రోజుల క్రితం ఏడాదిన్నర కూతురుతో కలిసి శక్తినగర్‌కు వచ్చిన శివాణి తన స్నేహితురాలి పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొంది. అలాగే హైదరాబాద్‌లో జరిగిన పెళ్లికి కూడా వెళ్లి తిరిగి శక్తినగర్‌కు వచ్చింది. పెళ్లి పూర్తి కావడంతో గురువారం భార్యను తీసుకెళ్లేందుకు శక్తినగర్ వచ్చిన పాండురంగ్ భార్యతో గొడవ పెట్టుకున్నాడు. హైదరాబాద్‌కు వద్దని చెప్పినా ఎందుకు వెళ్లావని భార్యపై కోపొద్రిక్తుడయ్యాడు. గొడవను ఇరుగుపొరుగు వారు సద్దుమణిగించారు. అనంతరం గురువారం రాత్రి ఏడు ప్రాంతంలో పాండురంగ్ తన భార్య శివాని, కూతురుతో ద్విచక్రవాహనంపై గుండూరుకు బయలు దేరారు. మార్గమధ్యలో శక్తినగర్ వంతెన దగ్గరకు రాగానే చలి ఎక్కువగా ఉందని.. కూతురికి టోపీ పెడతానని బండి ఆపాలని శివాని భర్తకు చెప్పింది. పాండురంగ్ బండిని ఆపగా శివాని ఒక్కసారిగా వంతెనపై నుంచి నీటిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడింది. భర్త విషయాన్ని వెంటనే శక్తినగర్, గుండూరు గ్రామస్తులకు సమాచారమిచ్చాడు. వంతెన వద్ద నీరు అధికంగా ఉండడంతో శుక్రవారం మధ్యాహ్నం గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెరుకు తోట దగ్ధం



రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలో శుక్రవారం చెరుకు తోట దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తోట నారాయణ తనకున్న వ్యవసాయ భూమిలో మూడెకరాల 12 గుంటలలో చెరుకు సాగు చేస్తున్నాడు. ఉదయం పొలానికి వెళ్లి పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భోజనం చేసి తిరిగి పొలానికి వెళ్లేలోగా చెరుకు పంట 80శాతానికి పైగా దగ్ధమైంది. దీంతో కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారి సహాయంతో మంటలను ఆర్పారు. స్థానిక ఆర్ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టంపై పంచనామా నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

బీబీపేట: మండలంలోని యాడారం గ్రామానికి చెందిన లక్కర్సు భిక్షపతి ఇంట్లో చోరీ జరిగింది. భిక్షపతి తాళం వేసి వెళ్లగా శుక్రవారం తెల్లవారుజామున దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తాళాలు తీసి అందులో ఉన్న రూ. 20వేలు, తులం బంగారం చైన్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.